మనం





నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం । 4 । నవంబర్ । 2026 పేజీలు: 8

మున్సిపల్ అక్రమాలపై
సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం!



- కామారెడ్డి మున్సిపల్ టెండర్లు, నియామకాలు, వేతనాల చెల్లింపులపై విచారణ.
- సీసీ కెమెరాల పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యంపై పరిశీలన.
- నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలి.. అదనపు కలెక్టర్కు బాధ్యతలు.
- అక్రమ వసూళ్లపై ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచన.
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ హామీ

2

కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో):కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమ వసూళ్లు, పాలనాపరమైన అవకతవకలు జరుగుతున్నాయంటూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.

సిరికొండ అటవీ రేంజ్ పరిధిలో
భూ ఆక్రమణలు అధికం!



అటవీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి.. హద్దులు పక్కాగా నిర్ధారించాలి

పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు

3



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు
ఘన స్వాగతం

స్వాగతం పలికిన బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

ఆర్మూర్, నవంబర్ 3 (మనం న్యూస్): ఆర్మూర్ నిర్మల్ జిల్లా లో నిర్వహించనున్న మహా పాదయాత్రకు వెళ్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు ఆర్మూర్ పట్టణంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర మంత్రికి స్వాగతం తెలిపారు.



వర్ని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన పోచారం శ్రీనివాసరెడ్డి

2

- రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా.
- వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చ.

నిజామాబాద్, నవంబర్ 03 (మనం బ్యూరో): నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు.

మున్సిపల్ అక్రమాలపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం!

- కామారెడ్డి మున్సిపల్ టెండర్లు, నియామకాలు, వేతనాల చెల్లింపులపై విచారణ.
- సీసీ కెమెరాల పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యంపై పరిశీలన.
- నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలి.. అదనపు కలెక్టర్కు బాధ్యతలు.
- అక్రమ వసూళ్లపై ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచన.
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ హామీ



కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో):కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమ వసూళ్లు, పాలనాపరమైన అవకతవకలు జరుగుతున్నాయంటూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.

అన్ని విభాగాలపై విచారణ.

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ, పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు, వారి హాజరు నమోదు, వేతనాల చెల్లింపుల వివరాలను పరిశీలించనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యం ఉందన్న ఆరోపణలపైనా విచారణ జరపనున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నోటీసులు, వాటిపై అధికారులు తీసుకున్న తదుపరి చర్యలు, మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశాల నిర్వహణ తీరును పరిశీలించనున్నారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్ల కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, కార్యక్రమం అనంతరం వాటిని విక్రయించిన తీరుపై వివరాలు సేకరించనున్నారు.

వ్యాపార అనుమతులపైనా ఆరా

మున్సిపల్ వాహనాల నెలవారీ ఇంధన వినియోగం, వ్యాపార అనుమతుల జారీ, ఇంటి పన్ను మదింపు ప్రక్రియ తదితర అంశాలనూ విచారణ పరిధిలోకి తీసుకున్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన రికార్డులు, లావాదేవీలు, అనుమతుల వివరాలను పరిశీలించి ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది నిర్ధారించనున్నారు.

ఆరోపణలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే సేవల్లో అవకతవకలు, అక్రమ వసూళ్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పష్టం చేశారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు.

మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో లేదా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందజేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వర్ని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన పోచారం శ్రీనివాసరెడ్డి

- రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా.
- వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చ.



నిజామాబాద్, నవంబర్ 03 (మనం బ్యూరో): నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు.

రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పోచారం శ్రీనివాసరెడ్డి స్వయంగా కలిసి మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, ఆసుపత్రిలో ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందుతుందా లేదా అనే విషయంపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైద్య సిబ్బంది నియామకంపై చర్చ.

అనంతరం డీసీహెచ్ఓ శ్రీనివాస్ ప్రసాద్తో మాట్లాడి ఆసుపత్రిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, ఆసుపత్రికి రావాల్సిన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పోచారం శ్రీనివాసరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.







ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఎంకేఎఫ్ ట్రస్టు

రూ.50,000 ఆర్థిక సహాయం అందజేత

భీమ్గల్ ,నవంబర్ 3 (మనం న్యూస్): సేవే లక్ష్యం మానవత్వమే మార్గం ఒకరి కష్టంలో తోడుగా నిలవడమే నిజమైన సేవ! మంగళవారం భీంగల్ మండలం పురాంపేట్ గ్రామానికి చెందిన మగ్గిడి గణేష్ కుమార్తె హైదరాబాద్లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ ఎంకేఎఫ్ ట్రస్టు ద్వారా రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.

ఈ ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును కౌన్సిలర్ నీలాం రవి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంకేఎఫ్ ట్రస్టు ఫౌండర్ రవితేజ పటేల్, ట్రస్టు సభ్యులు మనీష్, కర్క అజయ్,కాశర్ల భార్గవ్,కర్నే నరేష్ పాల్గొన్నారు.

కష్టకాలంలో ఆపన్నులకు అండగా నిలవడం, నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించడం, ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం చేయడమే ఎంకేఎఫ్ ట్రస్టు ప్రధాన లక్ష్యం.

సిరికొండ అటవీ రేంజ్ పరిధిలో భూ ఆక్రమణలు అధికం!

అటవీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి..

హద్దులు పక్కాగా నిర్ధారించాలి

పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు







నిజామాబాద్ రూరల్, నవంబర్ 3 (మనం న్యూస్): జిల్లాలో అటవీ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సిరికొండ అటవీ రేంజ్ పరిధిలో భూ ఆక్రమణలు అధికంగా జరుగుతున్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ జిల్లాలోని అటవీ విస్తీర్ణం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ భూముల ఆక్రమణలు, సంబంధిత చట్టాల అమలు తీరుపై వివరించారు. ముఖ్యంగా సిరికొండ రేంజ్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.

దీనిపై స్పందించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్ జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూములు ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా పక్కాగా సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సరిహద్దు వివాదాలు ఉన్న ప్రాంతాల్లో సంయుక్త సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అటవీ భూముల హద్దులను నిర్ధారించాలని తెలిపారు.

పెండింగ్లో ఉన్న ఆర్ఓఆర్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని, అటవీ పరిరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణకు పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, సిరికొండ ఎఫ్ఆర్ఓ కె. నర్సింగరావు, ఇందల్వాయి ఎఫ్ఆర్ఓ రవి మోహన్ బట్టు అటవీ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెద్దమల్లారెడ్డి పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం

ఎఫ్ఎల్ఎన్, మిడ్లైన్, సమ్మేటివ్ పరీక్షలపై ఉపాధ్యాయులకు అవగాహన

భిక్కనూర్ , నవంబర్ 3 (మనం న్యూస్): భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో రెండో రోజు ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో పాటు మిడ్లైన్ పరీక్ష సమ్మేటివ్ అసెస్మెంట్-1 తదితర విద్యా సంబంధిత అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా బిక్కనూర్ మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన దేవి, వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ బృంద సభ్యులు లాల్సింగ్, హరిప్రసాద్, స్వామి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమష్టి కృషి చేయాలని సూచించారు.

అనంతరం వనరుల వ్యక్తులు డి. స్వామి, రాజు, సంధ్య, దినేశ్ విద్యా బోధనకు సంబంధించిన వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేయడం, బోధనా పద్ధతుల్లో అవసరమైన మార్పులు చేయడం, మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవడం వంటి అంశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో సముదాయ వనరుల వ్యక్తులు ఈశ్వర్, సత్యనారాయణ, మహేందర్తో పాటు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయుల సమష్టి కృషి ఎంతో అవసరమని సమావేశంలో పేర్కొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక స్థైర్యం: ఎస్పీ

- జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా పోలీసు క్రికెట్ జట్టుకు ఎస్పీ జెర్సీల పంపిణీ.

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.



కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో): క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, పట్టుదలను అలవర్చుతాయని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ అన్నారు. జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు, ఎంపిక ప్రక్రియలో పాల్గొననున్న కామారెడ్డి జిల్లా పోలీసు క్రికెట్ జట్టు క్రీడాకారులకు ఆయన జెర్సీలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం పని ఒత్తిడిని ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు ఒత్తిడిని అధిగమించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, జట్టుగా పనిచేసే తత్వం, సమన్వయం, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతాయని తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా పోలీసు జట్టు సభ్యులు తమ ప్రతిభను చాటాలని, ఉత్తమ ప్రదర్శనతో కామారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీల్లో ఆత్మవిశ్వాసంతో పాల్గొని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలు, ధూమపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొని నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని, క్రీడాస్ఫూర్తితో ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్పీ సూచించారు.

మోడల్ స్కూల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్ట్స్, యోగా, కంప్యూటర్ టీచర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్...ప్రిన్సిపాల్ పురుషోత్తం వెల్లడి...

నవంబర్ 4 నుంచి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ.. ఒక్కో పోస్టుకు రూ.22,750 వరకు వేతనం...

రెంజల్, నవంబర్ 3 (మనం న్యూస్): తెలంగాణ మోడల్ స్కూళ్ళో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను అవుట్సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని (10) పది తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఆరట్స్ టీచర్, యోగా టీచర్, కంప్యూటర్ టీచర్, లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

నాలుగు విభాగాల్లో పోస్టుల భర్తీ.,

నోటిఫికేషన్ ప్రకారం ప్రతి మోడల్ స్కూల్కు ఒక్కో పోస్టు చొప్పున ఆరట్స్ టీచర్, యోగా టీచర్, కంప్యూటర్ టీచర్, లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆరట్స్ టీచర్కు నెలకు రూ.22,750, యోగా టీచర్కు రూ.22,750, కంప్యూటర్ టీచర్కు రూ.22,750, లైబ్రేరియన్కు నెలకు రూ.19,500 వేతనం చెల్లించనున్నారు.

అర్హతలు ఇవే.. వయోపరిమితి 21 నుంచి 44 ఏళ్లు.,

ఆర్ట్ టీచర్ పోస్టుకు అప్లైడ్ ఆర్ట్, పెయింటింగ్, శిల్పకళ, కమర్షియల్ ఆర్ట్స్, ప్రింట్ మేకింగ్, యానిమేషన్ విభాగాల్లో బీఎ/ఆబీఅ అర్హత ఉండాలి. యోగా టీచర్ పోస్టుకు డిగ్రీతో పాటు యోగాలో డిప్లొమా లేదా డిగ్రీ, యోగా స్పెషలైజేషన్తో బీపీఈడీ అర్హత ఉండాలి. కంప్యూటర్ టీచర్ పోస్టుకు కంప్యూటర్ సైన్స్, ఐటీ, బీటెక్, బీఈ, ఎంసీఏ, బీసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్ లేదా బీకాం కంప్యూటర్స్తో మాస్టర్స్ లేదా బ్యాచిలర్స్ డిగ్రీ కలిగి ఉండాలి. లైబ్రేరియన్ పోస్టుకు లైబ్రరీ సైన్స్ లేదా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్తో డిగ్రీ లేదా పీజీ అర్హత అవసరం. అన్ని పోస్టులకు కనీస వయస్సు 21 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 44 సంవత్సరాలుగా నిర్ణయించారు.



నవంబర్ 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ.,

అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 4 నుంచి నవంబర్ 6, 2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, అర్హత ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు విధానం, ఇతర వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అన్ని నియమాకాలు అవుట్సోర్సింగ్ పద్ధతిలోనే చేపట్టనున్నట్లు నోటిఫికేషన్లో స్పష్టం చేశారు...



గోవింద్‌పేట్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెరిగిన సామర్థ్యం

ట్రాన్స్‌ఫార్మర్ను విజయవంతంగా ఛార్జింగ్ చేసిన విద్యుత్ శాఖ అధికారులు

ఆర్మూర్ , నవంబర్ 3 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచే దిశగా కీలక చర్య చేపట్టారు. సబ్‌స్టేషన్లో గతంలో 3.15 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసి మంగళవారం విజయవంతంగా ఛార్జ్ చేశారు.దీంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటానికి, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి అవకాశం కలగనుంది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజనల్ ఇంజనీర్ బి. రఘు, పెర్కిట్ సబ్డివిజన్ ఏడీఈ ఎస్. శ్రీనివాస్, పెర్కిట్ ఏఈ సభావత్ కిషన్, పెర్కిట్ ఎల్ఐ గూడూ మియా, గోవింద్పేట్ లైన్మన్ నయీమ్, గ్రామ ఉప సర్పంచ్ సుశీన్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, సబ్ స్టేషన్ ఆపరేటర్ లు గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

దేవక్కపేటలో నూతన మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ



భీమ్గల్ ,నవంబర్ 3 (మనం న్యూస్): మంగళవారం భీమ్ గల్ మండలం దేవక్కపేట గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సంఘం మహిళా నూతన భవన నిర్మాణానికి ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ భూమి పూజ చేయడం జరిగింది.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి చేపడుతున్న గ్రామ సంఘ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని పాలకవర్గాన్ని కోరారు..

ఈ భవనానికి స్వచ్ఛభారత్ నిధులతో రూ. 1.50 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు ఇస్తామని తెలిపారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి తోపాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంకుడు గుంతల నిర్మాణము లో ప్రధాన భూమిక వహించాలని తెలిపినారు.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొత్తగా 7 గురుకి మంజూరు కాగా మంజూరు పత్రాలు అందజేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజ అజయ్ ఉప సర్పంచ్ ఏపీవో జీ నర్సయ్య , రఘు , గణేష్ పంచాయతీ కార్యదర్శి అజయ్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ సంఘం మహిళలు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

ఆనందోత్సాహాల మధ్య ముగిసిన రెంజల్ గ్రామ పండుగ వేడుకలు

పోతరాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లు.. గైనోళ్ల ఊరేగింపుతో మార్మోగిన గ్రామం...

సర్పంచ్ లలిత బుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా గ్రామ పండుగ...

రెంజల్, నవంబర్ 3 (మనం న్యూస్): రెంజల్ గ్రామంలో నిర్వహించిన గ్రామ పండుగ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి. గురువారం నాడు ముడుపులు వేసి ప్రారంభమైన పండుగ వేడుకలు మంగళవారం నాటికి ముగింపు పలికాయి. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, గైనోళ్ల ఊరేగింపులతో గ్రామ వీధులు సందడిగా మారాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు గ్రామ ప్రజలంతా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, మొక్కుల సమర్పణ.,

గ్రామంలోని కంతల్లా దొడ్డి మైసమ్మ, లక్ష్మమ్మ, ఊరెడమ్మతో పాటు వివిధ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ఆచార సంప్రదాయాల్లో భాగంగా మొత్తం ఐదు దున్నపోతులు, (36) ముప్పై ఆరు మేకలను బలి ఇచ్చి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలంతా ఒక్కచోట చేరి వేడుకల్లో భాగస్వాములయ్యారు.



గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు.,

గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లలు, పెద్దలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండి గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ ప్రజలు గ్రామ దేవతలను ప్రార్థించారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ ఐకమత్యంతో గ్రామ పండుగను నిర్వహించుకోవడం విశేషంగా నిలిచింది.

సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు.,

గ్రామ సర్పంచ్ లలిత బుజ్జి ఆధ్వర్యంలో గ్రామ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో పండుగ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, గైనోళ్ల ఊరేగింపులతో పండుగ చివరి రోజు వరకు గ్రామంలో సందడి నెలకొంది...

సెయింట్ పాల్స్ హైస్కూల్లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

– విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్నికలు

ఆర్మూర్ నవంబర్ 3 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తొలిసారిగా స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో హెడ్బాయ్గా అచ్యుత్.టి, డిప్యూటీ హెడ్గర్ల ప్రస్తుతి.ఎస్, టెక్నికల్ హెడ్గా డోరా వాలెన్సియా.బి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ లీడర్గా ఎం.శ్రీశాన్వి ఎన్నికయ్యారు. టీచర్ రిప్రజెంటేటివ్గా తెలుగు ఉపాధ్యాయురాలు సుమలత పడాల వ్యవహరించనున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమానికి కరస్పాండెంట్ బి.ఇనాక్ పాల్, వైస్ ప్రిన్సిపాల్ సిసిలియా పాల్ ప్రోత్సాహం అందించారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

'న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వినతి.

'పదోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి.



సదాశివనగర్, నవంబర్ 3(మనం న్యూస్): మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి,న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం సదాశివనగర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు.భోజన విరామ సమయంలో మండల విద్యాధికారి కార్యాలయంలో మండల విద్యాదికారి యసేఫ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని,కారుణ్య నియామకాలు చేపట్టాలని,పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.అర్హులైన టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ ప్రయోజనాలు కల్పించడంతో పాటు హెచ్చీటీ ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని కోరారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

-ప్రత్యేక అధికారి అశోక్.

సదాశివనగర్, నవంబర్ 3(మనం న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి అశోక్ ఆదేశించారు.మంగళవారం సదాశివనగర్ మండలం



మోడగం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు.నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్,సర్పంచ్ గౌడెల్లీ గంగాధర్,ఎపిఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గణేష్,ఫీల్ అసిస్టెంట్ మహేందర్ రెడ్డి,గ్రామస్థులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 14 ఫిర్యాదులు

- కామారెడ్డి టౌన్-2 సెక్షన్లో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక.

- ముఖ్య అతిథులుగా ఛైర్మన్ కె. కిషన్, సభ్యులు ఆర్. శేషారావు, పి. శ్రీనివాస్, కె. శ్రీనివాస్రెడ్డి.



కామారెడ్డి, నవంబరు 3 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా స్వీకరించి సత్వర పరిష్కారం అందించేందుకు కామారెడ్డి టౌన్-2 సెక్షన్ పరిధిలో మంగళవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-2) నిర్వహించారు. కామారెడ్డి టౌన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 14 ఫిర్యాదులు నమోదయ్యాయి. సీజీఆర్ఎఫ్-2 నిజామాబాద్ ఛైర్మన్ కె. కిషన్, సభ్యులు ఆర్. శేషారావు, టీజీఎన్పీడీసీఎల్ సభ్యుడు (ఫైనాన్స్) పి. శ్రీనివాస్, నాలుగో సభ్యుడు కె. శ్రీనివాస్రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కామారెడ్డి టౌన్ సబ్ డివిజన్తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల చర్యలు

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సర్వీస్ కనెక్షన్లు, మీటర్ల పనితీరు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించి పరిశీలించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాడ్వాయి నుంచి 3, కామారెడ్డి రూరల్ నుంచి 9, రాజంపేట నుంచి ఒకటి, రామారెడ్డి నుంచి ఒక ఫిర్యాదు వచ్చాయి. మొత్తం 14 ఫిర్యాదులు నమోదయ్యాయి. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేందుకు ఈ వేదిక దోహదపడుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థిని ఎంపిక

అండర్-19 విభాగంలో ప్రతిభ చాటిన నర్మల స్నితికా రెడ్డి



నిజామాబాద్ రూరల్, నవంబర్ 3 (మనం న్యూస్): క్రీడల్లో విద్యార్థులు రాణిస్తూ పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాల కరస్పాండెంట్ ఆర్. నర్సయ్య అన్నారు.

తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు సిద్ధిపేట జిల్లా గజ్వేల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ప్రాంగణం (గరల్స్ ఎడ్యుకేషనల్ హబ్)లో నిర్వహించనున్న 70వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-19 సాఫ్ట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థిని నర్మల స్నితికా రెడ్డి ఎంపికైంది.ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన స్నితికా రెడ్డిని ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అనికేత్, అనిల్ తదితరులు పాల్గొని విద్యార్థినికి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో స్నితికా రెడ్డి విజయం సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

గిరిజన హక్కుల కోసం బిర్సా ముండా పోరాటం చిరస్మరణీయం

- కామారెడ్డి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.

- జనజాతి గౌరవ దివస్లో భాగంగా బిర్సా ముండా జీవిత చరిత్రపై విద్యార్థులకు అవగాహన.



కామారెడ్డి, నవంబరు 3 (మనం న్యూస్): గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జీవితం, ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వసతి గృహ సంక్షేమ అధికారి నవీన్ కుమార్ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జనజాతి గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా కామారెడ్డి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా జీవిత చరిత్రను, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. గిరిజన సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి, ఎదుర్కొన్న సవాళ్లు, సమాజానికి అందించిన సేవలు, చేసిన త్యాగాలను తెలియజేశారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు పోరాటం

గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. బిర్సా ముండా ఆశయాలు, సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆయన జీవితంలోని ధైర్యం, పట్టుదల, సామాజిక స్పృహ వంటి విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి నవీన్ కుమార్తో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండలో 5 తేదీ నుంచి ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

మూడు రోజుల పాటు క్రీడా సంబరాలు.. యువ క్రీడాకారుల ప్రతిభకు వేదిక

నిజామాబాద్ రూరల్, నవంబర్ 3 (మనం న్యూస్): విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, సమష్టి కృషి, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా సిరికొండలో ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు-2026 నిర్వహించనున్నారు.

నిజామాబాద్ జిల్లా సిరికొండలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల వేదికగా నవంబర్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా వేడుక ప్రారంభోత్సవానికి విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, విద్యాభిమానులు, తల్లిదండ్రులు హాజరై యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఏఏపీసీ చైర్పర్సన్, సిబ్బంది కోరారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమాచారం కోసం ప్రత్యేక ఫోన్ నంబర్



బోధన్ 03 నవంబర్ (మనం న్యూస్): ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో సేవలు.. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

బోధన్: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, బస్సుల ప్రయాణానికి సంబంధించిన సమాచారాన్ని సులభంగా తెలుసుకునేందుకు బోధన్ ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక ఫోన్ నంబర్ను అందుబాటులోకి తీసుకొచ్చారు. బోధన్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అవసరమైన వివరాలను ఈ ఫోన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని డిపో మేనేజర్ బి. విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రయాణికులు బస్సుల ప్రయాణానికి సంబంధించిన సమాచారం, తమకు అవసరమైన వివరాలను తెలుసుకోవడానికి 9849500725 నంబర్కు ఫోన్ చేసి పూర్తి సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫోన్ నంబర్ ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజలు బస్సుల వివరాల కోసం ఇబ్బందులు పడకుండా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బోధన్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రయాణికులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేటు వాహనాలపై ఆధారపడకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిపో మేనేజర్ బి. విశ్వనాథ్ ప్రజలను కోరారు...

బిచ్కుంద పోలీసుల మెరుపు దాడులు

– పేకాట ఆడుతున్న 18 మందిపై కేసులు నమోదు

–రూ.21,600 నగదు, 10 సెల్ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

–జూదం పేకాటకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు

–బిచ్కుంద ఎస్సై రాజు హెచ్చరిక

బిచ్కుంద నవంబర్ 3 (మనం న్యూస్): కామారెడ్డి జిల్లా బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నిన్న బిచ్కుంద మండలంలోని కందర్ పల్లి , బిచ్కుంద లోకల్ మరియు పెద్దదడిగి గ్రామాల్లో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న మొత్తం 18 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రాజు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,600 నగదు, 10 సెల్ఫోన్లు మరియు 2 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బిచ్కుంద పోలీసులు గట్టి హెచ్చరిక జారీ చేస్తున్నారు. బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పేకాట, జూదం లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం



జరుగుతుంది. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలి. పండుగ సందర్భంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు డయల్ 112 లేదా బిచ్కుంద ఎస్హెచ్ఓ నంబర్ 8712686176కు సమాచారం అందించాలని కోరుతున్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని బిచ్కుంద ఎస్సై గుండె రాజు విజ్ఞప్తి చేస్తున్నారు

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

– బియ్యం దుకాణాల్లో అధికారుల తనిఖీలు.. రెండు సంస్థలపై కేసులు. ధరలు పెరగకుండా చర్యలు.

– కామారెడ్డి పట్టణంలో హోల్సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు.

– ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, వినియోగదారుల సేవా నంబరు తప్పనిసరి.

– వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి: అదనపు కలెక్టర్ విక్టర్.



కామారెడ్డి, నవంబరు 3 (మనం న్యూస్): బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు న్యాయమైన ధరలకు బియ్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కామారెడ్డి పట్టణంలోని పలు హోల్సేల్, రిటైల్ బియ్యం వ్యాపార దుకాణాల్లో మంగళవారం పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు. పట్టణంలో బియ్యం ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో బియ్యం ప్యాకెట్లను అధికారులు పరిశీలించారు. ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, వినియోగదారుల సేవా కేంద్రం ఫోన్ నంబరు ముద్రించకపోవడాన్ని గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని నిర్ధారించి, న్యాయ కొలతల శాస్త్రం (ప్యాకేజ్డ్ కమోడిటీస్) నిబంధనలు-2011లోని 6(1)(ఎ), 6(2) నిబంధనల ప్రకారం రెండు సంస్థలపై కేసులు నమోదు చేశారు.



కేసులు నమోదైన సంస్థలు:

1. జై సంతోషిమాత కిరాణా, సుభాష్ రోడ్, కామారెడ్డి.
2. లక్ష్మీ సాయి కిరాణా, జేపీఎన్ రోడ్, కామారెడ్డి.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ మాట్లాడుతూ., కామారెడ్డి పట్టణంలోని హోల్సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులు ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్ణయించిన గరిష్ఠ ధరలకు మించి విక్రయాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. నిర్ణీత ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మాలి

వినియోగదారులకు నాణ్యమైన బియ్యం న్యాయమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మాలని సూచించారు. బియ్యం ప్యాకెట్లపై తప్పనిసరిగా ముద్రించాల్సిన వివరాలను పొందుపరచడంతోపాటు, ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. తనిఖీలకు వచ్చే అధికారులకు వ్యాపారులు సహకరించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

పుట్టినరోజు వేళ డాక్టర్ మధుశేఖర్ సేవా హామీలు..!

భీంగల్, పెర్కిట్ ప్రజలకు ఉచిత ఓపీ సేవలు

– రైతులకు రాయితీ..వైద్యం విలేకర్లకు ఉచిత వైద్యం





ఆర్మూర్, నవంబర్ 3 (మనం న్యూస్): ఆర్మూర్ ఎంజే హాస్పిటల్ డాక్టర్ మధుశేఖర్ తన పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు సేవాభావంతో వైద్య సేవలు అందించేందుకు పలు కీలక హామీలు ప్రకటించారు. తన తల్లిదండ్రులు తనను డాక్టర్గా తీర్చిదిద్ది, ప్రజలకు సేవ చేయాలనే ఉన్నత ఆశయంతో విద్యాబుద్ధులు నేర్పించారని తెలిపారు. వారు చూపిన మార్గంలో నడుస్తూ సమాజానికి తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.ఎంజే హాస్పిటల్కు వచ్చే భీంగల్ ప్రాంత ప్రజలకు ఓపీ ఫీజు పూర్తిగా ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. పెర్కిట్ ప్రాంత ప్రజలపై తనకున్న ప్రత్యేక అభిమానంతో ఆ ప్రాంత ప్రజలకు కూడా ఉచిత ఓపీ సేవలు అందిస్తానని తెలిపారు.ప్రస్తుత ఎల్నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఓపీ ఫీజులో ఉచిత సేవతో పాటు వైద్య ఖర్చుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవ చేస్తున్న విలేకర్లకు సైతం ఉచిత వైద్యం అందిస్తానని ప్రకటించారు.పుట్టినరోజు వేడుకను కేవలం వ్యక్తిగత వేడుకగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల ప్రకటనకు వేదికగా మార్చడం విశేషం. వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు డాక్టర్ మధుశేఖర్ పేర్కొన్నారు.నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రేమాపూర్వక కృతజ్ఞతలు తెల్పిన డాక్టర్ మధుశేఖర్,

ఆవులకు, దూడలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



రుద్రూర్, నవంబర్ 3 (మనం న్యూస్) : రుద్రూర్ మండల కేంద్రంలోని అంబం(ఆర్), సిద్ధాపూర్ గ్రామాలలో మంగళవారం మూడు నెలల లోపు ఆవులకు, దూడలకు, ఉచిత నట్టల నివారణ మందులను పంపిణి చేశారు. ఈ శిబిరంలో 50 దూడలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణి చేయడం జరిగిందని పశువైద్యాధికారి డా. సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబం గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉప సర్పంచ్ సాయి ప్రసాద్, సిబ్బంది సాయిరాజ్, పాషా, అటెండర్ గంగారాం ఇంకా పశు పెంపకందారులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 125 పీజీ సీట్లను భర్తీ చేయాలి

స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్ డిమాండ్



నిజామాబాద్ రూరల్, నవంబర్ 3 (మనం న్యూస్): డిచ్పల్లి తెలంగాణ యూనివర్సిటీలో వివిధ పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న 125 సీట్లను భర్తీ చేసేందుకు తక్షణమే స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని మంగళవారం బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్ డిమాండ్ చేశారు.

ప్రతి సంవత్సరం తెలంగాణ యూనివర్సిటీలో వివిధ పీజీ కోర్సుల్లో సీట్లు మిగిలిపోతున్నప్పటికీ, వాటిని భర్తీ చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో సీట్లు ఖాళీగా ఉండటం విచారకరమన్నారు. అర్హత కలిగిన విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రతి సంవత్సరం మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ విషయంపై గతంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రాంబాబుకు వినతిపత్రం అందించినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో మంగళవారం వైస్ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు పిలుపు మేరకు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థుల సమస్యపై వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే ఖాళీగా ఉన్న పీజీ సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చి. సందీప్, చి. ప్రశాంత్, నాగమణి, అనూష, సుజన, వి. భాస్కర్, జి. కృష్ణ ప్రసాద్, డి. సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి





- నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించాలి.

- ఎల్నినో ప్రభావం, తగ్గుతున్న నీటి నిల్వలతో అప్రమత్తం.

- గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు.

- బిందు సేద్యం, విత్తనాలపై ప్రభుత్వ రాయితీలు రైతులకు అందించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో): రాబోయే యాసంగి (రబీ) సీజన్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో మెరుగైన దిగుబడి, ఆదాయం పొందగలిగే పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం.

పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. ఆయిల్పామ్, కూరగాయల వంటి ఉద్యాన పంటల సాగుతో తక్కువ నీటిని వినియోగిస్తూ మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు.

బిందు సేద్యం, విత్తనాలపై ప్రభుత్వ రాయితీలు.

బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అందించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. సాగుభూముల సంరక్షణ కోసం అమలు చేస్తున్న 'ఖేత్ బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలన్నారు. పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. రైతు బీమా పరిహారం పొందడంలో కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలగకుండా మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు.

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి.

నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పరిస్థితులను అంచనా వేసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకొని ఆర్థిక నష్టాలను నివారించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీఆర్డీఓ దామోదర్రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఏడీఏలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు రావుట్ల విద్యార్థులు ఎంపిక

జోనల్ స్థాయిలో ప్రతిభ చాటిన ముగ్గురు క్రీడాకారులు



నిజామాబాద్ రూరల్ , నవంబర్ 3 (మనం న్యూస్): క్రీడల్లో గ్రామీణ విద్యార్థులు సైతం అద్భుత ప్రతిభ కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. ఇందుకు నిదర్శనంగా సిరికొండ మండలం రావుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో రావుట్ల పాఠశాలకు చెందిన మనోజ్, మలావత్ స్వాతి, మలావత్ వంశీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు క్రీడల అధికారి రాజేందర్ నాయక్ తెలిపారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కే. రాజ్ కుమార్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఇట్టంపేట రమేష్, గ్రామ పాలకమండలి సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులు జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ అందజేత

బీబీపేట, నవంబర్ 03(మనం న్యూస్):బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ సుధారాణి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్తాబాద్ అనిల్ ప్రొసీడింగ్ కాపీని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుడిసెలు లేని ఇల్లే లక్ష్యంగా పనిచేస్తూ పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి,లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ ద్వితీయ సెమిస్టర్ ఫలితాలు విడుదల

70 మంది విద్యార్థులకు పరీక్షలు.. 38 మంది ఉత్తీర్ణత, 30 మందికి ప్రమోషన్

నిజామాబాద్ రూరల్ , నవంబర్ 3 (మనం న్యూస్): డిచ్పల్లి తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 2025 బ్యాచ్కు సంబంధించిన బీటెక్ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరి రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరితో కలిసి మంగళవారం ఫలితాలను ప్రకటించారు.

ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె. సంపత్ కుమార్ ఫలితాల వివరాలను వెల్లడించారు.

బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 56 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 29 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 11 మంది పురుషులు, 18 మంది మహిళలు ఉన్నారు. మరో 25 మంది విద్యార్థులు తదుపరి సెమిస్టర్కు ప్రమోట్ కాగా, ఇద్దరు విద్యార్థులు డిటైన్ అయ్యారు.



అదేవిధంగా బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో 14 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో తొమ్మిది మంది ఉత్తీర్ణత సాధించగా, ఐదుగురు విద్యార్థులు తదుపరి సెమిస్టర్కు ప్రమోట్ అయ్యారు.

రెండు విభాగాలను కలిపి మొత్తం 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 38 మంది ఉత్తీర్ణత సాధించారు. మరో 30 మంది తదుపరి సెమిస్టర్కు ప్రమోట్ కాగా, ఇద్దరు విద్యార్థులు డిటైన్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి (పీజీ) డాక్టర్ టి. సంపత్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి, డాక్టర్ నందిని తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో భజన ఆలపించిన సనాతన భజన మండలి సభ్యులు

సదాశివనగర్, నవంబర్ 3(మనం న్యూస్): మండల కేంద్రానికి చెందిన సనాతన భజన మండలి సభ్యులు మంగళవారం తిరుమల తిరుపతి లో జరిగిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా భజన కీర్తనలు ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొప్పుల నర్సారెడ్డి, జంగం గంగాధర్, కాటిపల్లి లక్ష్మీ కాంతం, రాజారెడ్డి, బాబయ్య, బిట్ల రామదాసు, పోసాని దుర్గయ్య, శ్రీహరి, అశోక్ రెడ్డి, విట్టల్ రెడ్డి, శేఖర్, బాలరాజు, గంగారెడ్డి, లింభారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీరామ్ వెంకటేష్

మానవ హక్కుల పరిరక్షణ, సమాజ సేవకు ప్రాధాన్యతనివ్వాలి: ఎస్పీ సూచన



భిక్కనూర్, నవంబర్ 03 (మనం న్యూస్): నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్తులో చేపట్టనున్న సేవా కార్యక్రమాల గురించి చర్చించారు.

ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ ప్రజా సమస్యల పరిష్కారం, బాధితులకు న్యాయం జరిగేలా అండగా నిలవడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంస్థకు ఉన్న గుర్తింపు బాధ్యతలను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల్లో నమ్మకం పెంపొందించుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు.

అలాగే సమాజ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఎస్పీ సూచనలపై స్పందించిన శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలన, బాధితులకు అండగా నిలవడం, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్పీ సూచనలను పాటిస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

పేకాట నిర్మూలనకు ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు: ఎస్పీ

- నిరంతరం నిఘా.. సమాచారం అందిన వెంటనే దాడులు.
- పేకాట నిర్మూలనే లక్ష్యం, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం.
- జూదం కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రభావం.
- జూదం ఆడినా.. నిర్వహించినా చట్టపరమైన చర్యలు: జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర.



కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో): జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర వెల్లడించారు. ఈ బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ జిల్లావ్యాప్తంగా పేకాట స్థావరాలపై నిరంతర నిఘా జాడ కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరిగి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జూదం సంపాదనకు మార్గం కాదని, జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు.

యువత క్షణిక ఆనందాలకు, అత్యాశకు లోనై పేకాటకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఎస్పీ సూచించారు. జూదం కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే పోలీసు రికార్డుల్లో వివరాలు నమోదవుతాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్లో గత కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో చట్టప్రకారం వేలిముద్రలు సేకరించి పోలీసు రికార్డుల్లో భద్రపరిచే అవకాశం ఉంటుందని వివరించారు. క్షణికమైన ఆనందం కోసం జీవితకాల భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హితవు పలికారు.

జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 8712686133.

జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, నిర్వహిస్తున్నా ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా, విశ్వసనీయ సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్టేషన్కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ 8712686133 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

జూదానికి దూరంగా ఉండండి.

జూదం, పేకాట నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములై పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలకు, సమాజానికి మంచి భవిష్యత్తును అందించాలని సూచించారు. జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.. యువత భవిష్యత్తును పదిలంగా ఉంచుకోండి అని పిలుపునిచ్చారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి: సీపీఐ

- ఇస్సాయిపేటలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించిన సీపీఐ నాయకులు.
- వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి పంట రూ.50 వేల పరిహారం చెల్లించాలి: పశ్యపద్మ.
- కౌలు రైతులను నష్టపరిహారం అందించాలి, నవంబర్ 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా.



కామారెడ్డి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్): కామారెడ్డి నియోజకవర్గం పల్వంచ మండలంలో ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితుల కారణంగా ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా పల్వంచ మండలం ఇస్సాయిపేట గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను ఆమె సీపీఐ, రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ., గ్రామంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయినా, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని నమోదు చేసేందుకు అధికారులు రాకపోవడం ఆందోళనకరమన్నారు. ఎండిన వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి పంటకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. రబీలో పంటలు సాగు చేసే అవకాశం లేని రైతులకు ఎకరాకు రూ.20 వేలు అందించాలని, పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలన్నారు.

రేషన్ ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

మహిళా రైతులు స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను కూడా రీషెడ్యూల్ చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.700 కూలీ కల్పించాలని కోరారు. రేషన్ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని సూచించారు. కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించి కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ పిలుపులో భాగంగా నవంబర్ 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి దేవయ్య, నాయకులు కే. రాజం, జోహార్ కృష్ణమూర్తి, ఉప్పు రాజయ్య, నరసయ్య, తెలుగోళ్ల ఎల్లవ్వ, సి. దేవయ్య, దాసరి కమల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.